రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో 'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com





శనివారం | 11-4-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 641 పేజీలు: 2 వెల : రూ.7

# ఎమ్మెల్యే ఇంటూరి ఆకస్మిక తనిఖీలతో.. బెంబేలు!

* మోచర్ల సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే * 11 మందికి.. ఒక్కరే ఆన్‌డ్యూటీ
* సంతకాలు చేసి వెళ్లిపోయిన సచివాలయ సిబ్బంది
* సిబ్బందిపై కలెక్టర్, ఎంపీడీవోకు ఎమ్మెల్యే ఫిర్యాదు

గుడ్లూరు, ఏప్రిల్ 10 (జాతీయ వార్త): గుడ్లూరు మండలం మోచర్ల గ్రామసచివాలయంలో 11 మంది సిబ్బంది పనిచేస్తుండగా... శుక్రవారం ఒక్కరు మాత్రమే డ్యూటీలో ఉన్నారు. మిగతా పదిమంది ఉదయాన్నే రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు... శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీకి వెళ్లడంతో సిబ్బంది నిర్లక్ష్యం వెలుగు చూసింది. సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా రావడం లేదని, తెట్టు గ్రామస్తులు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన... సచివాలయానికి ఆకస్మికంగా వెళ్లారు. ఆ సమయంలో డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే ఉన్నారు. మిగతా పదిమందిలో ముగ్గురు మాత్రం, గుడ్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశానికి హాజరైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు, మిగిలిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ... వారికి మెమోలు ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఆ తర్వాత కలెక్టర్ రాజాబాబుకు, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలకు సిఫార్సు చేశారు.






## పిల్లలు తక్కువ... అటెండెన్స్ ఎక్కువ

* తెట్టు హైస్కూల్ ఆకస్మిక తనిఖీలో వెలుగుచూసిన వైనం
* ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే ఆగ్రహం

గుడ్లూరు, ఏప్రిల్ 10 (జాతీయ వార్త): గుడ్లూరు మండలం తెట్టులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి క్లాస్ రూమ్, వంటగది పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం, మెనూ అమలు, ఇతర సౌకర్యాలపై వారినుంచి సమాధానాలు రాబట్టారు. ఒకటి నుంచి 9 తరగతుల వరకు 128 మంది విద్యార్థులు చదువుతుండగా, ఎమ్మెల్యే తనిఖీ సమయంలో 100 మంది లోపే ఉన్నారు. కానీ విద్యార్థులు 100 శాతం హాజరైనట్లు అటెండెన్స్ వేసినట్లు ఎమ్మెల్యే గుర్తించారు. దీంతో ఆయన ఉపాధ్యాయులు, హెచ్‌ఎం చిన్నయ్య పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ అటెండెన్స్ ఎందుకు వేశారని నిలదీయడంతో టీచర్లు నీళ్లు నమిలారు. కొంతమంది పిల్లలు వచ్చి వెళ్లిపోయారని, మరి కొంతమంది ఇంకా రాలేదని... ఉపాధ్యాయులు పొంతన లేని సమాధానాలు చెప్పడంపై ఎమ్మెల్యే వారిని మందలించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంటనే డీఈవో బాలాజీరావుకు ఫోన్ చేసి, ఉపాధ్యాయుల తీరుపై ఫిర్యాదు చేశారు. ఇలాంటి విషయాలపై అప్పుడప్పుడు ఎందుకు తనిఖీ చేయడం లేదని పేరెంట్ టీచర్స్ అసోసియేషన్ చైర్మన్ రియాజ్, స్థానిక నేతలను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇకనుంచి హైస్కూల్ లో పరిస్థితులను నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. హైస్కూల్ భవనం పైఅంతస్తులో నిర్మాణం





అసంపూర్తిగా ఉండటంవల్ల క్లాస్ రూములు సరిపోవటం లేదని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన స్పందిస్తూ.. వేసవి సెలవులు అనంతరం బడులు తెరిచేలోగా పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక





# భూసేకరణ వేగవంతం చేయాలి

**✻ జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



**ఉలవపాడు, ఏప్రిల్ 10 (జాతీయ వార్త):** రామయపట్నం పోర్టు అనుసంధానంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశీతో కలిసి ఉలవపాడు తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇండోసోల్ పరిశ్రమకు సంబంధించి ఉలవపాడు మండలం, కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియ పురోగతి, అలాగే మండలంలో రెవెన్యూ సమస్యలు, గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియను మిషన్ మోడ్‌లో పూర్తీ చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అందులో భాగంగా సర్వే ప్రక్రియను నెల రోజుల లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం భూమి ఎంత ఉంది, అందులో పట్టా భూమి, ప్రభుత్వ భూమి, డికేటి భూమి ఎంత వుంది, అందులో ఇప్పటివరకు ఎంత భూమి సర్వే చేశారు తదితర వివరాలతో సంపూర్ణ నివేదిక రూపొందించడంతో పాటు రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని త్వరితగతిన భు సేకరణ ప్రక్రియను పూర్తీ చేయాలన్నారు. రెవిన్యూ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీ తిరిగి రీ ఓపెన్ కాకుండా అర్జీదారులకు సహేతుకమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపైనా కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో రామయపట్నం పోర్టు భూసేకరణ ఎస్డిసి లు శ్రీ నాగిరెడ్డి, శ్రీ నాసరయ్య, తహసిల్దార్ శ్రీ రవి శంకర్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### మతం మారినా..
## కుల వివక్షత పోవటం లేదు?

**✻ షెడ్యూల్ కులాలు, తెగల క్రైస్తవులను ఎస్సీలు గానే గుర్తించాలి ✻ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన పార్టీలు,సంఘాలు**

**కందుకూరు, ఏప్రిల్ 10 (జాతీయ వార్త):** షెడ్యూల్ కులాలు క్రైస్తవ మతంలోనికి మారితే కులం హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రాజ్యాంగ సమీక్ష కమిటీ పున: పరిశీలన చేసి దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ షెడ్యూల్ కులాల ప్రజలు క్రిస్టియన్ మతం లోనికి మారితే భారత రాజ్యాంగం వారికి కల్పించిన రక్షణ చట్టాలు కోల్పోతారని తీర్పు విలువరించిందని. ఇది భారత లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైనదిగా భావిస్తూ దళితులు షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగలు ప్రజలు క్రైస్తవ్యం తీసుకోవడం వలన సమాజములో వారు కులపరంగా ఎదుర్కొను వివక్షత అంటరానితనం అవమానాలు ఏమి రూపు మారటం లేదని అందుకే షెడ్యూల్ కులాల ప్రజలకు క్రైస్తవంలో మారినప్పటికీ కూడా రాజ్యాంగం ఆర్టికల్ 15 లో కల్పించిన విధంగా రక్షణ చట్టాలను అమలు చేయాలని కోరారు. అదేవిధంగా భారత పౌరులు వారికి నచ్చిన మతం స్వీకరించే విధంగా ఆర్టికల్ 25 ప్రతిపాదించిన మత స్వేచ్ఛను గౌరవించాలని కోరుతున్నామన్నారు.ఈ విషయమును రాజ్యాంగ బెంచ్ కూడా తెలియచేసి షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగల ప్రజల పట్ల వారి హక్కులను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ జాతీయ సలహాదారులు ముప్పవరపు కిషోర్, భారత కమ్యూనిస్టు పార్టీ కందుకూరు నియోజకవర్గం కార్యదర్శి భూసి సురేష్ బాబు, సిపిఎం పట్టణ కార్యదర్శి షేక్ గౌస్ బాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతరబోయిన నరేష్, ఒలేటి వారి పాలెం మండల పాస్టర్ ఫెలోషిప్ సలహాదారులు వై.దేవ కుమార్, అధ్యక్షులు దువ్వూరి యాకోబు, పాస్టర్స్ గౌడపేరు.సుబ్బారావు, గల్లా జయరావు,కొమ్ము బాబురావు లింగా బత్తిన ధామస్, కొప్పర్తి జాషువా, సిపిఐ నాయకులు బొల్లోజుల బాల బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.


## వధువును ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, ఏప్రిల్ 10 (జాతీయ వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని దివివారిపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు చుండూరి మాల్యాద్రి కుమార్తె ప్రసన్న వివాహం సందర్భంగా శుక్రవారం వారి ఇంటివద్ద జరిగిన నలుగు కార్యక్రమానికి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరై, ప్రసన్నను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మండల మాజీ అధ్యక్షులు నార్నే రోశయ్య, పార్టీ నాయకులు నల్లూరి రమేష్ బాబు, నల్లూరి సుబ్బారావు, పాతూరి మాలకొండయ్య, నల్లూరి మాధవరావు, కామని మల్లికార్జున, నల్లూరి యలమంద తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో ఎమ్మెల్సీ తూమాటి


**కందుకూరు, ఏప్రిల్ 10 (జాతీయ వార్త):** కందుకూరు మండలం, దివివారిపాలెం చుండూరి మాల్యాద్రి కుమార్తె వివాహ కార్యక్రమములలో శుక్రవారం ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ శుభకార్యంలో ఎమ్మెల్సీ వెంట తానికొండ కొండ కృష్ణయ్య, మాజీ సర్పంచి తురక సురేష్, దివి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# పోతవరంలో కలెక్టర్ పల్లెనిద్ర




**✻ సమస్యల పరిష్కారం కోసం పల్లె నిద్ర ✻ జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ✻ సమస్యలపై ఏకరువు పెట్టిన గ్రామస్థులు ✻ దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించిన కలెక్టర్**



**దర్శి, ఏప్రిల్ 10 (జాతీయ వార్త):** ప్రజల సమక్షంలోనే సమస్యలను పరిష్కరించేందుకు 'పల్లెనిద్ర' చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. శుక్రవారం ఆయన దర్శి మండలంలోని పోతవరం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక శివాలయం వద్ద గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు ప్రస్తావించిన సమస్యలను వాటి పరిష్కారానికి కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులతోనూ కలెక్టర్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలను కలెక్టర్ ముందు ఏకరువు పెట్టారు. గామంలో సీసీ రోడ్లు వేయాల్సిన అవసరం ఉంది. అలాగే దెబ్బ తిన్న పోతవరం తిమ్మాయిపాలెం రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని. సైడ్ డ్రెయిన్లు నిర్మించాలి. తానంచింతల గ్రామంలో రోడ్డు ఆక్రమణ గురైంది. ఆక్రమణ తొలగించి రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరం ఉంది. గ్రామ సమీపంలో వున్న చెరువుకు దర్శి కెనాల్ నుండి నీటిని సరఫరా చేయాలి. భూ సమస్యలను పరిష్కరించి పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలి. గ్రామంలోని వాటర్ ట్యాంకు ను క్లీన్ చేయాలి. ఈ నియోజక వర్గంలో నీటి సమస్య ఎక్కువగా ఉంది. నీటి సమస్య పరిష్కారానికి అధికారుల చొరవ చూపాలి. తాత్కాలికంగా మంజూరు కాబడిన సదరన్ సర్టిఫికెట్స్ స్థానంలో పర్మనెంట్ సదరన్ సర్టిఫికెట్స్ గా మంజూరు చేయాలి. మండలంలో ఎక్కువ సంఖ్యలో అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనంలో నడుస్తున్నాయి, వీటికి సొంత భవనాలు నిర్మించాలి. దేవరం గ్రామంలో చాలా సంవత్సరాలుగా సుమారు 90 మంది సన్నకారు, చిన్న కారు రైతులు ప్రభుత్వ భూమిని సాగు చేసుకోవడం జరుగుచున్నది. సాగుచేసుకుంటున్న రైతులకు గుర్తింపు కార్డు ఇప్పించాలి. దర్శి నియోజకవర్గం పరిధిలో చాలా మంది డయాలసిస్ పేషంట్స్ ఉన్నారు. వీరు చికిత్స నిమిత్తం మార్కాపురం, కనిగిరికి పోతున్నారు. దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటుచేయాలి. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా గ్రామంలోని శివాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.




## మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు



**ఉలవపాడు, ఏప్రిల్ 10 (జాతీయ వార్త):** మండల కేంద్రమైన ఉలవపాడు జి.వి.ఎస్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్, నార్కోటిక్ డ్రగ్స్ మరియు సైకో ట్రోపిక్ సబ్ స్టాంప్స్-1985పై అవగాహన సదస్సు జరిగింది. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డా.డి. సుజాత అధ్యక్షతన, ఇంగ్లీష్ అధ్యాపకులు డా. ఈ.ఎస్.పి. కుమార్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం నేడు తీవ్రమైన సామాజిక, ఆరోగ్య సమస్యగా మారిందని, ఇది కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని, మత్తు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని అధ్యాపకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేత్ర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546